


నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
శనివారం | డిసెంబర్ 02, 2023 | www.navatelangana.com

- బూత్‌లవారీగా పోలైన ఓట్లలో వాటాపై లెక్కలు
- గ్రామాలు, మండలాలు, వార్డుల
- కార్యకర్తలు, పోలింగ్ ఏజెంట్ల ద్వారా వివరాల సేకరణ
- రోజంతా లెక్కలతో కుస్తీపడిన ఆయా పార్టీల నేతలు
- 'మా నాయకుడిదే విజయమంటే లేదు.. మా నాయకుడితే గెలుపు' అంటూ ధీమా
- డిసెంబర్ 3న గెలుపు ఎవరిదో చూద్దామంటూ సవాళ్లు..
- ప్రజల్లోనూ గెలుపోటములపై చర్చోపచర్చలు
- ప్రశాంతవాతావరణంలో ఎన్నికల నిర్వహణలో అధికార యంత్రాంగం సక్సెస్



గురువారం పోలింగ్ ముగిసిన మర్నాడు నుంచి పోటీలో ఉన్న ప్రధానపార్టీల అభ్యర్థులు అంతర్మథనంలో పడ్డారు. బూత్‌లవారీగా పోలైన ఓట్లలో తమకు అనుకూలంగా పడిన వాటి లెక్కలను కిందిస్థాయి శ్రేణుల నుంచి తెలుసుకుంటున్నారు. శుక్రవారం ఉదయం నుంచే ఆ లెక్కలతో కుస్తీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రధానపార్టీ శ్రేణుల మధ్య 'మా నాయకుడిదే విజయమంటే.. లేదు.. మా నాయకునిదే గెలుపు' అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్ 3న గెలుపు ఎవరిదో చూద్దామంటూ సవాళ్లు విసురుకుంటున్నారు. మరోవైపు ప్రజల్లోనూ ఎన్నిల పోలింగ్, అభ్యర్థుల గెలుపోటములపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఏదేమైనా గురువారం సాగిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతవాతావరణంలో సాగడంపై ఆయా జిల్లాల అధికారులు, పోలీసుల శాఖలు తమ సిబ్బందికి అభినందనలు తెలుపుకున్నారు.

- నవతెలంగాణ,
కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

అంతర్మథనం..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గురువారం జరిగిన పోలింగ్‌శాతం చూస్తే పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా 70శాతం దాటలేదు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం 80శాతంపైనే పోలింగ్ నమోదైంది. అయితే సిరిసిల్ల, కరీంనగర్ తప్ప మిగిలిన నియోజకవర్గాల్లో గత ఎన్నికల కంటే పోలింగ్ శాతం ఎక్కువగానే నమోదైంది. 2009 నుంచి 2014, 2018, 2023 ఎన్నికల్లో జిల్లాలవారీగా ఓటింగ్‌శాతాన్ని పరిశీలిస్తే దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఓటింగ్‌శాతం పెరిగింది.అయితే గత 2018 ఎన్నికలతో పోల్చితే మాత్రం అన్ని జిల్లాల్లోనూ పోలింగ్‌శాతం తగ్గింది. కరీంనగర్ జిల్లాలో 2018 ఎన్నికల్లో 79.69శాతం నమోదైతే ఈ ఎన్నికల్లో 75.64శాతమే ఓట్లు పడ్డాయి. పెద్దపల్లి జిల్లాలో 2018 ఎన్నికల్లో 80.47శాతం పోలింగ్ నమోదైతే ఈ ఎన్నికల్లో 75.62శాతమే వేశారు. జగిత్యాల జిల్లాలో గత ఎన్నికల్లో 78.28శాతం ఓట్లు పోలైతే ఈ ఎన్నికల్లో 76.12శాతమే పోలింగ్ నమోదైంది. సిరిసిల్ల జిల్లాలో 2018 ఎన్నికల్లో 80.72శాతం ఓట్లు పడితే ఈ ఎన్నికల్లో 75.92శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. సాధారణంగా ఓట్ల శాతం పెరిగితే ప్రత్యర్థి పార్టీలకు మేలు జరుగుతుందన్న రాజకీయవిశ్లేషకులు చెబుతుంటారు. ఇప్పుడు గత ఎన్నికలతో పోల్చితే 5 నుంచి 7శాతం ఓటింగ్ తగ్గడం చూస్తుంటే అన్ని నియోజకవర్గాల్లోనూ అభ్యర్థుల మధ్య గట్టిపోటీయే ఉంటుందని చెప్పవచ్చు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో గెలుపోటములపై చర్చోపచర్చలు ప్రజల్లో సాగుతున్నాయి. ఇదే సమయంలో అభ్యర్థులకు తమ గెలుపు లెక్కల అంచనాలు అంతుచిక్కని పరిస్థితియే నెలకొంది.

మిగతా 2లో...

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఈవీఎంలలో భవితవ్యం..
- ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద భారీ భద్రత 3లో...





పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య

- ఫోన్‌ల్లో ఆడొద్దని మందలించిన కుటుంబ సభ్యులు 3లో...

రాష్ట్రంలో, రామగుండంలో గెలిచేది బీఆర్ఎస్సే..

5లో...

- రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్

కేటీఆర్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయం

నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు 3లో...

కేటీఆర్ పాలన ధృతరాష్ట్ర కౌగిలి లాంటిది

సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డి 3లో...

టవర్ సర్కిల్ వద్ద బండి సంజయ్ సందడి..



జిలేబి తింటున్న బండి సంజయ్

నవతెలంగాణ - కరీంనగర్ :

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన అనంతరం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ శుక్రవారం కరీంనగర్ టవర్ సర్కిల్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న మామాజీ జిలేబి సెంటర్ వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జిలేబీ తిన్నారు. సామాన్య ప్రజలలాగా బండి సంజయ్ అక్కడికి రావడంతో పలువురు షాప్ యజమానులు, ప్రజలు తనను కలవడానికి వచ్చారు. ఈ సందర్భంగా వారందరిని ఆప్యాయంగా పలకరిస్తూ, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో బిజీ బిజీగా గడిపిన సంజయ్ కుమార్ కాస్త ఫ్రీ టైం దొరకడంతో ఇలా సేద తీరారు.

లైఫ్ కేర్ ఫార్మసీ ప్రారంభం

నవతెలంగాణ - జమ్మికుంట :

జమ్మికుంట పట్టణంలో ఆముదాలపల్లి యశ్వత్ లైఫ్ కేర్ ఫార్మసీ శుక్రవారం మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నరేష్, పొనగంటి సారంగం, దయ్యాల శ్రీనివాస్, పాతకాల రమేష్, వెంకటేశ్వర్లు, డాక్టర్ తిరుపతి, దేవేందర్‌రెడ్డి, క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంజయ్‌కుమార్ పరామర్శ



నవతెలంగాణ-జగిత్యాల టౌన్ :

జగిత్యాల పట్టణ 44వ వార్డుకు చెందిన శ్రీధర్ ప్రమాదవశాత్తు గాయపడగా వారిని బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్. రమణ పరామర్శించారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షుడు గట్టు సతీష్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన ఓటింగ్ ఎవరికి లాభం...?

- **జగిత్యాల వ్యాప్తంగా 76.12శాతంగా నమోదు**
- **2018 ఎన్నికల్లో 78.83 శాతం**

నవతెలంగాణ- జగిత్యాలటౌన్ :

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ముగిసింది. గతంతో పోల్చుకుంటే పోలింగ్ శాతం తగ్గింది. జగిత్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పోలింగ్ జరుగగా మొత్తంగా 76.12 శాతం కంటే తక్కువగా పోలింగ్ నమోదైంది. 2018లో 78.83 శాతం పోలింగ్ నమోదు కాగా, 2023లో 76.12శాతం నమోదైంది. ఈసారి గతంలో కంటే తక్కువ ఓటింగ్ శాతం నమోదయ్యింది. కోరుట్లలో 73.68శాతం, ధర్మపురిలో 77.50శాతం, జగిత్యాలో 73.54శాతం పోలింగ్ నమోదు అయింది. పోలింగ్ కేంద్రాలకు 5 గంటలు తరువాత వచ్చే వారికి అనుమతిని నిరాకరించారు. ఐదు గంటల లోపు పోలింగ్ కేంద్రంలో ఉంటే వారికి ఓటు హక్కు వినియోగించుకొనేందుకు అవకాశం ఇచ్చారు. జగిత్యాల జిల్లాల్లో ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గడం రాజకీయంగా ఎవరికి కలిసొస్తుందన్న అంశంపై చర్చ జరుగుతోంది. తగ్గిన ఓటింగ్ శాతం ఎవరికి లాభం..? ఎవరికి నష్టం అనే విషయాలపై రాజకీయ వర్గాలు విశ్లేషణలు చేస్తున్నాయి. సాధారణంగా ప్రభుత్వంపై వ్యతిరేకత ఎక్కువగా ఉంటేనే ఓటింగ్ శాతం గణనీయంగా పెరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమ వుతున్నాయి. ఓటింగ్ శాతం తగ్గడం అధికార పార్టీకే కలిసొస్తుందని పలువురు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్ తదితర సంక్షేమ పథకాల ద్వారా లబ్దిపొందుతున్న వర్గాలు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నట్లు తెలిసింది. ప్రధానంగా వృద్ధులు, వికలాంగులు ఓటింగ్‌లో ఎక్కువగా పాల్గొన్నారు.

అంతర్మథనం...

(మొదటి పేజీ తరువాయి)

ఎగ్జిట్‌పోల్స్‌పై 'హస్తం' శ్రేణుల్లో ధీమా..
బీఆర్ఎస్‌లో గుంభనం

ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఎగ్జిట్‌పోల్స్‌పైనే చర్చ సాగుతోంది. మెజార్టీ సర్వే సంస్థలు తమ ఎగ్జిట్‌పోల్స్ కాంగ్రెస్‌కుఅనుకూలంగా ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో గెలుపుపై ధీమా వ్యక్తమవుతోంది. గురువారం సాయంత్రమే సంబురాలు చేసుకోండంటూ ఆ పార్టీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపును స్వాగతించినా డిసెంబర్ 3 వరకు వేచి ఉందామనే రీతిలో ఎవరూ పెద్దగా స్పందించలేదు. అయితే కరీంనగర్ నియోజకవర్గంలో మాత్రం కాంగ్రెస అభ్యర్థి పురుమళ్ల శ్రీనివాస్, అతని శ్రేణులు మాత్రం నగరంలో సంబురాలు నిర్వహించారు. గత ఎన్నికల్లో గట్టి పోటీనిచ్చి స్వల్ప ఓట్ల తేడాతోనే సీటు చేజార్చుకున్న వేములవాడ, ధర్మపురి, చొప్పదండి నియోజకవర్గాల్లో మాత్రం గెలుపుపై గట్టిగానే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి మానకొండూర్‌లోనూ కనిపిస్తుండటం గమనార్హం. మరోవైపు గత ఎన్నికల్లో కూడా ఎగ్జిట్‌పోల్స్ కాంగ్రెస్‌వైపే ఉన్నా.. ఫలితాలు మాత్రం బీఆర్ఎస్‌కే వచ్చాయి. దీంతో ఆ సర్వే సంస్థల రిపోర్టుపై బీఆర్ఎస్ శ్రేణులు అపనమ్మకంగానే ఉన్నారు. స్వల్ప మెజార్టీతో అయినా తమ పార్టీ అభ్యర్థి గెలుపును అందుకుంటాడన్న చర్చలతో గులాబీ శ్రేణులు గుంభనంగా ఉన్నాయి. మరోవైపు గత ఎన్నికలకంటే పెద్దగా ఓటింగ్‌శాతం పెరగకపోవడం, 20వేల నుంచి 30వేల మధ్య ఓట్ల మెజార్టీతో గెలిచిన స్థానాల్లో మళ్లీ 'కారు'దే విజయమంటూ ధీమాలో ఉన్నారు.

బూత్‌లవారీగా పోలైన ఓట్లలో వాటాపై లెక్కలు

ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల పరిధిలో ఎవరికి వారుగా ప్రధాన పార్టీల నాయకులు తమకే విజయావకాశాలున్నాయని బయటకు చెబుతున్నా.. బూత్‌లవారీగా పోలైన ఓట్లలో తమ వాటాకింద ఎన్ని వస్తాయో కిందిస్థాయి శ్రేణుల ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీల వారీగా వచ్చిన ఓట్లను పరిగణనలోకి తీసుకుంటూనే ఈసారి ఏ గ్రామాలు, డివిజన్లతో ఎవరికి ఓట్లు పెరిగాయి? తగ్గాయి? అనే విశ్లేషణలు చేసుకుంటున్నారు. కరీంనగర్, హుజూరాబాద్, వేములవాడ, కోరుట్ల తప్ప మిగిలిన నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌గానే వార్ సాగింది. ఈ రెండు పార్టీలకే బలంగా ఓట్లు పడ్డాయి. అయితే త్రిముఖ పోరు ఉన్న నియోజకవర్గాల్లో ఎవరు ఎవరి విజయావకాశాల్ని దెబ్బతీస్తారనే చర్చ ఊపందుకుంది. మరోవైపు గ్రామాల వారీగా పోలింగ్ వివరాలు తెలుసుకోవడంతో పాటు తమకు ఎంత మేర ఓట్లు పడ్డాయనే దానిపై అనుచరుల నుంచి నివేదికలు తెప్పించుకుంటున్నారు. పోలింగ్ ముగియగానే బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ముఖ్య అనుచరులతో సమావేశాలు ఏర్పాటు చేసి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు.

పొరపాట్లకు తావులేకుండా...

ఆయా జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లో పెద్దపెద్ద ఎల్ఈడీ తెరలు అమర్చి పోలింగ్ కేంద్రాలకు అనుసంధానం చేసిన వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల అధికారులు పోలింగ్ ముగిసే సమయం వరకూ వీక్షించారు. ఒక్కో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎల్ఈడీ తెరలు ఏర్పాటుచేసి వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో ఏం జరుగుతోందో కలెక్టరేట్ నుంచే ప్రత్యక్షంగా వీక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే సరిచేసుకునేలా పోలింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఫలితంగా పెద్దగా పొరపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించి సక్సెస్ అయినందుకు అటు కలెక్టర్లు, ఇటు పోలీసు ఉన్నతాధికారులు తమ సిబ్బందికి అభినందనలు తెలిపారు. పోలింగ్ రోజు ప్రలోభాలకు గురిచేస్తున్నారంటూ పలువురు సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు 424 ఫిర్యాదులు అందగా ఇందులో పోలింగ్ రోజుకు సంబంధించినవి 30 ఉన్నాయి. ఫిర్యాదులు ఆధారంగా సంబంధిత తనిఖీ బందాలతో విచారణ చేపట్టారు. తనిఖీ బందాలు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన చేశాయి. ఆయా జిల్లాల్లోని ని అన్ని నియోజకవర్గాల్లో ఓటుకు నోటు పంపిణీ జరిగినట్లు ఆరోపణలున్నాయి.

ప్రపంచ ఏయిడ్స్ డే



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జీ ప్రిన్సిపాల్ క్యాతం సత్యనారాయణ మాట్లాడుతూ ఎయిడ్స్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ఎయిడ్స్ రహిత సమాజం నిర్మించాలన్నారు. ఎయిడ్స్ సంభోగం ద్వారా, రక్తమార్పిడి ద్వారా, కలుషిత సిరంజి ద్వారా, తల్లిపాల ద్వారా వ్యాపిస్తుందన్నారు. లైంగిక సంబంధాలతో హ్యూమన్ ఇమ్మునియో డిఫిసియెన్సీ వైరస్ వ్యాపిస్తుందని అన్నారు. ఎయిడ్స్‌కు ఎలిసా టెస్టు చేయబడుతుందని మందు లేదని జాగ్రత్తలు పాటించాలని అన్నారు. శరీరంలో రోగనిరోధకశక్తి తగ్గుతుందని మానవులు బలహీను లైపోతారని తెలిపారు. జాతీయ సేవపథకం ప్రోగ్రామ్ అధికారి వాసరవేణి పర్శరాములు మాట్లాడుతూ ఎయిడ్స్ అధికంగా ఉన్న దేశాలలో మొదటిస్థానంలో ఆఫ్రికా దేశం ఉండగా, రెండవస్థానంలో భారతదేశం ఉందని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిపట్ల భయం అవసరంలేదని, దోమకాటువల్ల, వ్యాధి ఉన్నవారితో కలిసి ఉండటంవల్ల, స్పర్శించడంవల్ల రాదని జాగ్రత్తలు పాటించడం ద్వారా నివారించవచ్చునని ప్రతి ఒక్కరు అవగహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పాటలపోటీలలో గెలుపొందిన విద్యార్థిని అలియాకు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, ఆర్ గీత, అగోలం గౌతమి, చిలుక ప్రవళిక, కొడిముంజ సాగర్, లక్ష్మి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుకు జరిగేలా సమన్వయం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



నవతెలంగాణ - సిరిసిల్ల :

3న జరిగే అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు సమన్వయం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లో బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ అధికారులకు దిశ నిర్దేశం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ లెక్కింపు జరిగేలా చూడాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. సంబంధిత రిపోర్ట్‌లు ఎప్పటికప్పుడు పంపాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ అధికారులు, సిబ్బంది తమకు నిర్దేశించిన విధులపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్ లను నిబంధనలను అనుసరించి భద్రపరచాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి, రిటర్నింగ్ అధికారులు ఆనంద్‌కుమార్, మధుసూదన్, ప్రత్యేక ఉప కలెక్టర్ బి గంగయ్య, తదితర అధికారులు పాల్గొన్నారు.

కౌంటింగ్ సెంటర్ వద్ద పటిష్ట బందోబస్తు

పోలీస్ అధికారులను అభినందించిన సీపీ

నవతెలంగాణ-కరీంనగర్



కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నాడు అన్నీ పోలీస్ స్టేషన్ల, వివిధ విభాగాలకు చెందిన అధికారులందరితో పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కమిషనరేట్ వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ ముగిసిందని అన్నారు. పటిష్టమైన ప్రణాళిక, క్రమశిక్షణతో అధికారులందరూ పనిచేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. అన్ని విభాగాలకు చెందిన అన్ని స్థాయిలకు చెందిన అధికారులందరినీ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ ముగిసినప్పటికీ, పోస్ట్ పోలింగ్ ఇంకా మిగిలి ఉందని అధికారులు, సిబ్బంది గుర్తించాలన్నారు. కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా, ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా ప్రశాంతంగా ముగిసేలా నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ.లక్ష్మీనారాయణ (శాంతి భద్రతలు), సి.రాజు, (పరిపాలన), ఏసీపీలు నరేందర్ (టౌన్), కరుణాకర్ రావు(రూరల్) జీవన్ రెడ్డి (హుజూరాబాద్), తదితరులు పాల్గొన్నారు.

c m y k

నవతెలంగాణ 3
రాజన్న సిరిసిల్ల
శనివారం | డిసెంబర్, 02 2023 | www.navatelangana.com

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

నవతెలంగాణ - సిరిసిల్ల :

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ నెల 3వ తేదీన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా చూసేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు.

ఈవీఎంలలో భవితవ్యం..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం ఈనెల 3న తేలిపోనుంది. ఆ రోజు ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. అదే రోజు సాయంత్రానికి పూర్తి ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

లెక్కింపునకు ఏర్పాట్లు...

3న జరగనున్న ఓట్ల లెక్కింపు కోసం ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీనియోజకవర్గాలకు అదే పాఠశాలలో వేరు వేరు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో నియోజకవర్గంలో 14+1 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

లెక్కింపులో జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు లెక్కించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంకు 3టేబుల్‌లను ఏర్పాటు చేసి ఒకే రౌండ్ లో లెక్కింపు పూర్తి చేస్తారు. సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గం కు 4 టేబుల్ లను ఏర్పాటు చేసి ఒకే రౌండ్ లో లెక్కింపు పూర్తి చేస్తారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం కౌంటింగ్ హాలులో 14టేబుల్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహిస్తారు. సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 21రౌండ్లు, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంలో 19రౌండ్లలో ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేస్తారు.



ఈవీఎంలు భద్రపరిచి స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేస్తున్న అధికారులు

ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద భారీ భద్రత

తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద స్థానిక పోలీసులు, ఆర్మ్ డ్ రిజర్వ్, కేంద్ర బలగాలతో స్ట్రాంగ్ రూమ్స్ దగ్గర బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ అనుమతి ఉన్నవారికే స్ట్రాంగ్ రూమ్స్ లోకి అనుమతి ఇస్తున్నారు. స్ట్రాంగ్ రూంల వద్ద 24గంటలు పటిష్ట నిఘా, భద్రతను ఏర్పాటు చేశారు.

కార్యకర్తలకు గుర్తింపు ఉంటుంది

ఓటర్ మహాశయులకు ధన్యవాదాలు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మండల కేంద్రంలో గురువారం జరిగిన శాసనసభ ఎన్నికలకు సహకరించిన ఓటర్ మహాశయులకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ధన్యవాదాలు తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తలను ఉద్దేశించి నర్సయ్య మాట్లాడుతూ కార్యకర్తల కృషి కాంగ్రెస్ గెలుపుకు ఎంతో ముఖ్యభూమిక వహించిందన్నారు.కార్యకర్తలను నాయకులమంతా కాపాడుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అందరిని కలుపుకొని ప్రజాసేవలు, గ్రామాల అభివృద్ధి చేసుకోవడానికి కృషి చేస్తామన్నారు. కార్యకర్తలను ఎవరిని కించపరచడం, తక్కువ చూడడం జరుగదని అన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, కార్యదర్శి లింగంగౌడ్, చెన్ని బాబు, రాజేందర్, బుచ్చాగౌడ్‌లు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ - గంభీరావుపేట :

ఫోన్లో ఆడొద్దని మందలించడంతో ఓ యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం దమ్మన్నపేట గ్రామానికి చెందిన పోశయ్య కుమారుడు ఆవునూరి శ్రీనివాస్(27) స్థానికంగా ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఐతే నిరంతరం ఫోన్లో చూడడంతో కుటుంబ సభ్యులు ఆడటం చూడటం ఏంటని మందలించడంతో కోపంతో ఫోన్ పగలగొట్టి తండ్రి కౌలు చేస్తున్న పొలం వద్దకు వెళ్లి పురుగులమందు తాగాడు. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి మృతి చెందినట్టు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెంట్రింగ్ సంఘం కమిటీ ఎన్నిక..



నవతెలంగాణ - వేములవాడ :

వేములవాడపట్టణంలోని సెంట్రింగ్ సంఘం నూతన కమిటీని భవన నిర్మాణ, కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అధ్యక్షతన ఏకగ్రీవంగా కొత్త కమిటీని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షులుగా గాజుల పోశెట్టి, ఉపాధ్యక్షులుగా కుమ్మరి లక్ష్మణ్, కోశాధికారిగా పారేపల్లి అంజి, కార్యవర్గ సభ్యులుగాశ్రీను, శీలం రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు పోశెట్టి మాట్లాడుతూ తామీద నమ్మకంతో అధ్యక్షగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. సంఘం బలోపేతకు అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. సెంట్రింగ్ లో ఉన్న సమస్యలను అధికారులకు, ప్రజాప్రతినిధుల దష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా చూస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కేటీఆర్ పాలన ధృతరాష్ట్ర కౌగిలి లాంటిది

నవతెలంగాణ - సిరిసిల్ల :



సిరిసిల్లలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డి

కేటీఆర్ పాలన ధృతరాష్ట్ర కౌగిలి లాంటిదని సిరిసిల్లలో కాంగ్రెస్ మేనిఫెస్టోను కేటీఆర్ కాపీ కొడుతున్నారని సిరిసిల్ల శాసనసభ అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డి ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పార్టీ అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సిరిసిల్ల కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉన్న అంశాన్ని వార్డులుగా ఏర్పాటుచేసిన విలీన గ్రామాలను తిరిగి సిరిసిల్లలోని కలుపుదామని కాంగ్రెస్ పార్టీ చెప్పిన విషయాన్ని ఇచ్చిన హామీని కేటీఆర్ కాపీ కొడుతూ మళ్లీ ప్రజల్లోకి తీసుకుపోతున్నారని ఆయన అన్నారు. సిరిసిల్లాను అభివృద్ధి చేసిన అని చెప్పుకునే కేటీఆర్ ఇప్పుడు ఎన్నికల ముందే సిరిసిల్ల అండర్ గ్రౌండ్ అభివృద్ధి చేస్తానని ఎందుకు మాట్లాడుతున్నారని గతంలోనే చేసి ఉండొచ్చు కదా అని, కేటీఆర్ విడుదల చేసిన ఒక ఆడియో ద్వారా తను సిరిసిల్లలో వారానికి రెండు రోజులు అందుబాటులో ఉంటానని చెప్పాడు.. దీన్నిబట్టి గతంలో ఎప్పుడూ కూడా సిరిసిల్లలో అందుబాటులో లేడని అర్థమవుతుందని, గతంలో 2009లో మొదటిసారి పోటీ చేసినప్పుడు సిరిసిల్లలోని ఇల్లు కట్టుకొని కుటుంబంతో సహ ఉంటారని చెప్పిన కేటీఆర్ ఇప్పటివరకు కూడా సిరిసిల్లలో ఒక్కరోజు కూడా నిద్ర చేయలేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేతలు నాగుల సత్యనారాయణ గౌడ్, గడ్డం నరసయ్య, చొప్పదండి ప్రకాష్, వైద్య శివప్రసాద్, కామని వనిత, సామల పావని, ఎల్ప లక్ష్మీనారాయణ, మడుపు శ్రీదేవి, చందన గోలి, వెంకటరమణ, సూర దేవరాజు, వేల్మూల స్వరూప పాల్గొన్నారు.

కేటీఆర్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయం

నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు

నవతెలంగాణ - గంభీరావుపేట :



సిరిసిల్లలో కేటీఆర్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు అన్నారు. శుక్రవారం గంభీరావుపేట మండల బిఆరస కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తల కృషి మరువలేనిదన్నారు. సిరిసిల్ల శాసన సభ్యున్నిగా కల్వకుంట్ల తారక రామారావుభారీ మెజార్టీతో గెలవడం తథ్యమన్నారు.మూడో సారి హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి,సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, నాయకులు సురేందర్ రెడ్డి, లక్ష్మణ్, దయాకర్, లక్ష్మీరెడ్డి కమలాకర్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా టేకుచెట్ల నరికివేత

- సిబ్బంది అండతోనే రాయికల్ అటవీ రేంజ్ పరిధిలో అక్రమాలు
- రాత్రి సమయంలో కలప రవాణా
- వాల్టా చట్టానికి తూట్లు
- కొరవడిన అధికారుల నిఘా



రాయికల్ అటవీ రేంజ్ పరిధిలో టేకు చెట్ల నరికివేత



నవతెలంగాణ-రాయికల్

అడవుల సంరక్షణ కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఆ లక్ష్యం నెరవేరడం లేదు. అడవులు అటవీ భూముల సంరక్షణకు పగడ్బందీ చర్యలు తీసుకుం టున్నామని ఉన్నతాధికారులు పేర్కొంటున్నా రాయికల్ రేంజ్ పరిధిలో కొంతమంది కింది స్థాయి సిబ్బంది మాత్రం చెట్లు నరికి వేయడానికి తమ పూర్తి సహకారం అందిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

రాయికల్ అటవీ రేంజ్ పరిధిలో 1150030.11 హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉంది. ఈ పరిధిలో ఒక రేంజ్ అధికారి, ఏడుగురు బీట్ ఆఫీసర్లు, నలుగురు సెక్షన్ ఆఫీసర్లు ఉండగా, ఆయా బేస్ క్యాంపుల్లో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నలుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. చెట్లతో కళకళలాడే దట్టమైన అడవి అక్రమార్కుల గొడ్డలి వేటుకు నేల కొరుకుతున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళల్లో లక్షల విలువచేసే టేకు చెట్లను దుంగలుగా నరికి అక్రమ రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

సిబ్బంది అండతోనే చెట్ల నరికివేత..?

రాయికల్ రేంజ్ పరిధిలోని క్షేత్ర సిబ్బంది తీరు ఇంటి దొంగను ఈశ్వరుడైన పట్టుకోలేడు అనే చందంగా మారింది. క్షేత్ర స్థాయిలో చెట్ల నరికివేత, అక్రమ కలప రవాణాను అడ్డుకోవాల్సిన అటవీశాఖ అధి కారులు, బేస్ క్యాంప్ సిబ్బంది అక్రమార్కులకు అండగా నిలు స్తున్నారనే ఆరోపణలు కోకొల్లలుగా వినిపి స్తున్నాయి. ఉన్నతా ధికారులు తనిఖీ కోసం వెళ్ళేలోపే అక్రమార్కులకు సమాచారం చేరడంతో దుండగులను పట్టుకోవడం అధికారులకు సవాల్‌గా మారుతుంది..

రాత్రి సమయంలో అక్రమ రవాణా..

అటవీ సమీప గ్రామాల్లో టేకు కలప అక్రమ రవాణాకు అలవాటు పడిన కొందరు అటవీశాఖ సిబ్బందితో చేతులు కలిపి రాత్రి వేళల్లో ఏపుగా పెరిగిన టేకు చెట్లను నరికి దుంగలును ద్విచక్ర వాహనాలపై గ్రామాలకు తీసుకొచ్చి అక్కడి నుంచి వాహనాల్లో పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారని, మరికొందరు డైనింగ్ టేబుల్, సోఫాలు, మంచాలు, కిటికీలు, డోర్ల లాంటి ఇంటి సామగ్రి వస్తువులు తయారు చేయించి పట్టణాలకు సరఫరా చేస్తున్నారని విమర్శలున్నాయి.

వాల్టా చట్టానికి తూట్లు..

వాల్టా చట్టం ప్రకారం పట్టా భూముల్లోని ఏ చెట్లను నరికివేసేందుకు అయినా రైతులు ముందుగా ఏ సర్వే నెంబర్‌లో ఎన్ని చెట్లను తొలగించడం జరుగుతుందో రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. రెవెన్యూ అధికారులు సంబంధిత స్థలంలో సర్వే జరిపి ఒక చెట్టును నరికివేస్తే ఆ స్థలంలో రెండు చెట్లను నాటుతానని రైతు వాగ్మూలం తీసుకొని అనుమతి ఇచ్చిన తర్వాత ఆన్‌లైన్ ద్వారా అటవీ శాఖ నుండి అనుమతులు పొందాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి అనుమతులు పొందకుండానే కొందరు అక్రమ కలప రవాణా వ్యాపారస్తులు అసైన్డ్, పట్టా భూముల్లోని చెట్లను యథేచ్ఛగా నరికివేస్తూ అక్రమ రవాణా చేస్తున్నారనే విమర్శలున్నాయి.

కొరవడిన నిఘా..

2014 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ అడవుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్య మించింది. హరితహారం పేరిట రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది మొక్కలను నాటించింది. మరోవైపు స్మగ్లర్ల బారి నుంచి అడవులను కాపాడేందుకు ఫారెస్ట్ సిబ్బందికి ద్విచక్ర వాహనాలను సైతం సమకూర్చింది. ఉద్యోగం ఉన్న చోటనే నివాసం ఉండాలని ఆదేశాలు జారీ చేసింది.కానీ అటవీశాఖ సిబ్బంది కొందరు స్థానికంగా ఉండక పట్టణ ప్రాంతాల్లో ఉంటున్నారు.దీంతో అటవీ ప్రాంత గ్రామాలపై నిఘా కొరవడింది.

ఉన్నతాధికారులు స్పందించి రాయికల్ పరిధిలో టేకు,ఇతర అటవీ సంపదను కాజేస్తున్న అక్రమా ర్కులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, అటవీ శాఖ కింది స్థాయి సిబ్బందిపై నిఘా ఉంచి అక్ర మార్కులకు అండగా నిలుస్తున్న వారిని వెంటనే సస్పెం డ్ చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

చట్ట పరమైన చర్యలు తీసుకుంటున్నాం..

గత నెల రూ 1,77,455 విలువ గల కలపను పట్టుకుని కల్లెడలోని ప్రభుత్వ కలపడిపోకు తరలిం చామని, చెట్లను ఎవరైనా నరికివేస్తే దుండగులను గుర్తించి కేసులు నమోదు చేస్తామని చెప్పారు. రేంజ్ పరిధిలో నిత్యం నిఘా ఉంచి అక్రమ కలప తరలించే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటున్నామని,బీట్ ఆఫీసర్ల కదలికలపైనా ప్రభుత్వం త్వరలో జీపీఎస్ ట్రాకర్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. అటవీ సంరక్షణ కోసం మొదటిసారిగా చింతలూరులో వాచ్ టవర్ నిర్మాణం చేపట్టామని, బోర్నపల్లి, ఉప్పుమడుగు ప్రాంతాల్లో చెక్ పోస్ట్‌ల ఏర్పాటుకు నివేదికలు పంపామన్నారు.సిబ్బంది కదలి కలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

-టి.భూమేష్ (అటవీ క్షేత్రాధికారి)



రాయికల్ అటవీ శాఖ కార్యాలయం



అనుమతికి మించి పట్టా భూమిలో నరికివేసిన కలప

అన్ని పార్టీల్లోనూ అంతర్మథనం

- ఎగ్జిట్ పోల్స్‌పై తీవ్ర తర్జనభర్జన
- పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కలు
- ఓటరు తీర్పుపై అభ్యర్థుల్లో టెన్షన్

నవతెలంగాణ- జగిత్యాల

సార్వత్రిక ఎన్నికల సమరంలో కీలకమైన పోలింగ్ ప్రక్రియ గురువారం ముగిసింది. ఓటరు తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. గతానికి భిన్నంగా ఈసారి రెండు నియోజకవర్గాల్లో మూడు పార్టీలు, ఒక నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ హోరాహోరీ ప్రచారం చేయడంతో ఓట్లు చీలి ఎవరికి మేలు చేస్తాయోనన్న ఆందోళన అభ్యర్థుల్లో నెలకొన్నది. శు క్రవారం ఉదయం నుంచి అభ్యర్థులు తమ ముఖ్య అనుచరులతో కలిసి ఓట్ల శాతాన్ని పరిశీలిస్తున్నారు. బూత్‌ల వారీగా నమోదైన ఓట్లు, అందులో మహిళలు, పురుషుల వారీగా లెక్కలేసుకుంటూ తమకు అనుకూలమా ? ప్రతికూలమా ? అని చర్చిస్తున్నారు. గురువారం ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నానికి కాస్త పుంజుకుంది. మొత్తానికి 76.12 శాతం పోలింగ్ జరిగింది.

పలుచోట్ల హోరాహోరీ

జగిత్యాల జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పలుచోట్ల పోరు హోరాహోరీ పోరు సాగింది. జగిత్యాల,



కోరుట్ల నియోజకవర్గాల్లో మూడు ప్రధాన పార్టీల నడుమ నువ్వా..నేనా ? అన్నట్లుగా పోటీ కనిపించింది. ధర్మపురిలో మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ జరిగింది. ఆయా ప్రాంతాల్లో ఓటర్లు సైతం అభ్యర్థుల వారీగా విడిపోయి ఓట్లు వేసిన పరిస్థితి నెలకొంది. కాగా, ఉదయం 7 నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 1 గంట నుంచి పోలింగ్ బూత్‌లకు తాకిడి ఎక్కువైంది.

రేపు ఓటింగ్.. అభ్యర్థుల్లో ఉత్కంఠ

నిన్న మొన్నటివరకు ప్రచారం ఎలా జరుగు తుందో.. ఓటర్లను ఎలా మచ్చిక చేసుకోవాలో.. డబ్బుల పంపిణీ ఎలా చేయాలనే అంశాలపై ఆందోళన చెందిన అభ్యర్థులు.. ప్రస్తుతం ఫలితాలు ఎలా ఉంటాయనే దానిపై తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. బూత్‌ల వారీగా జరిగిన ఓటింగ్ సరళిని అంచనా వేసుకుంటున్న కొంతమంది గెలుస్తాం.. లేదోననే టెన్షన్‌తో సతమత మవుతున్నారు. ఫలానా చోట మనకు మంచి స్పందన ఉందని, అక్కడ మెజార్టీ ఎక్కువే వస్తుందని ఆశపడుతున్నా.. ఇతర ప్రాంతాల్లో తగ్గే అవకాశం ఉందని అనుచరులు చెబుతున్న మాటలతో హడలిపోతున్నారు. ఈనెల 3వతేదీ ఆదివారం ఫలితాల లెక్కింపుతో ఈ ఉత్కంఠకు తెరపడనుంది.

ఎగ్జిట్ పోల్స్‌పై టెన్షన్

గురువారం సాయంత్రం విడుదలైన ఎగ్జిట్ పోల్స్ అన్ని పార్టీలను ఆందోళనలోకి నెట్టేశాయి. చాలా సర్వే సంస్థలు కాంగ్రెస్ అనుకూలమని చెప్పినా చివర్లో పరిస్థితి తారుమారవు తుందేమోనన్న ఆందోళన అభ్యర్థుల్లో నెలకొన్నది. గతంలో వందల ఓట్లతో ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు కూడా అట్లయితే ఏంటన్న ప్రశ్న నెలకొంటోంది. అధికార బీఆర్ఎస్ నేతలు మాత్రం విజయంపై ధీమాగా ఉన్నాయి. సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి తమను గట్టెక్కిస్తాయని అంచనా వేస్తున్నారు.

గెలుపు ధీమాలో అభ్యర్థులు..?

ఈవీఎంల్లో అభ్యర్థుల భవితవ్యం







నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

కోరుట్ల నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. గురువారం జరిగిన పోలింగ్ శాతంపై కార్య కర్తలు, నాయకులతో సమీక్షిస్తున్నారు. వారు ఇచ్చే సమాచారంతో గెలుపు ధీమాలో ఉన్నారు. ఈనెల 3న జరగనున్న కౌంటింగ్‌తో వారి భవితవ్యం తెలనుంది. కోరుట్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన పోల్ మేనేజ్‌మెంట్‌పై ధీమాతో ఉంది. అంతేకాకుండా నియో జకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చేసిన అభివృద్ధి చూసి ప్రజలు ఓటు వేశారని లెక్కలేసు కొంటుంది. ఇటు బీజేపీ అభ్యర్థి తమ ఓటు బ్యాంక్‌పై నమ్మకంతో ఉన్నారు. అంతేకాకుండా పసుపు బోర్డు ఏర్పాటు చేశామని ప్రధాని మోడీ ప్రకటనపై రైతుల్లో నమ్మకం ఉందని, వారు బీజేపీ వైపే మొగ్గు చూపి ఉంటారని ధీమాలో ఉన్నారు. బీజేపీ ముఖ్యంగా పట్టణాల్లో జరిగిన ఓటింగ్‌పై ఆశలతో ఉంది. వారు బీజేపీ వైపే మొగ్గు చూపి ఉంటారని పార్టీ శ్రేణులు చెబుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు కాంగ్రెస్ ఉన్న వేవ్‌ను నమ్ముకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు ఉన్న పట్టుతో పాటు పోల్ మేనేజ్‌మెంట్ తమకు కలిసి వస్తుందనే ఆశలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. అంతేకాకుండా ముఖ్యంగా రాష్ట్రంలో ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్‌కే ఎక్కువ సీట్లు వస్తాయని వెల్లడించడంతో గెలుపు ధీమాలో ఉన్నారు.

అన్యాయాన్ని లోకానికి చాటడానికే నామినేషన్ వేశా

స్వతంత్ర అభ్యర్థిని చిటి శ్యామల



చిటి శ్యామల

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

నా పెద్ద కొడుకు ద్వారా తనకు జరిగిన అన్యాయాన్ని లోకానికి చాటడానికే జగిత్యాల అసెంబ్లీ బరిలో స్వతంత్ర అభ్యర్థిగా నామి నేషన్ వేశానని ఎవరికి నష్టం కలిగించడం నా ఉద్దేశం కాదని స్వంత్ర అభ్యర్థి చిటి శ్యామల అన్నారు. శు క్రవారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడారు. తన సమస్యను లోకానికి చాటడానికి నామినేషన్ వేయడం జరిగిందన్నారు. మీడియా సహకారంతో దేశ విదేశాల్లో నుంచి మద్దతు దొరికిందని శ్యామల పేర్కొన్నారు. తమ సమస్యను జరిగిన అన్యాయాన్ని లోకానికి చాటిన మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. డబ్బు, పలుకుబడి కలిగిన తన పెద్ద కొడుకు మూలంగా నాకు జరిగిన అన్యాయం, కోర్టు కేసుల అంశం ప్రజలకు, పాలకులకు, అధికారులకు తెలవడం కోసమే నామినేషన్ వేశామని చెప్పారు. కేవలం నామినేషన్ వరకే పరిమిత మైనామని ఎటు వంటి ప్రచారాలకు పోలేదని పోటీలో ఉన్న ఎవరికి నష్టం కలిగించడం తమ ఉద్దేశం కాదన్నారు.

బీజేపీ డబ్బులు మాకు రాలేదు..

మహిళా సంఘాల సభ్యుల ఆందోళన

నవతెలంగాణ-కథలాపూర్

ఓటింగ్ సందర్భంగా బీజేపీ పార్టీ నాయకులు పంపిణీ చేసిన డబ్బులు తమకు ఇవ్వలేదని కథలాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. బీజేపీ నాయకులు మహిళా సంఘాల పేర్లు చెప్పుకొని డబ్బులు కాజేశారని ఆరోపించారు. బీజేపీ డబ్బులు పంపిణీ చేయమని చెబితే వాళ్ల జేబులు నింపుకున్నారని మహిళలు పెద్ద మొత్తంలో వాపోయారు. అనంతరం సర్పంచ్ కంటే నీరజ సత్యనారాయణ వారికి నచ్చజెప్పడంతో తిరిగి వెళ్లిపోయారు.



నవతెలంగాణ
5
పెద్దపల్లి
శనివారం | డిసెంబర్ 02, 2023 | www.navatelangana.com

రాష్ట్రంలో, రామగుండంలో గెలిచేది బీఆర్ఎస్ పార్టీనే



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని:
రాష్ట్రంలో, రామగుండంలో గెలిచేది బీఆర్ఎస్ పార్టీయేనని, రామగుండం నియోజకవర్గంలో ప్రజల ఆశీస్సులతో, బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తల నిర్విరామ కృషితో తిరిగి తానే ఎమ్మెల్యేగా గెలవబోతున్నానని, రానున్న అయిదేళ్లలో ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తానని, మరింత మెరుగైన సేవలందిస్తానని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు దాదాపు రెండు నెలల పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ, గడపగడపకూ తీసుకెళ్లడంలో సఫలీకృతులయ్యారని, తన గెలుపే లక్ష్యంగా కృషి చేశారని కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలను మభ్యపెట్టడానికి, ప్రలోభపెట్టడానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్నో కుట్రలు చేశాడన్నారు. తాను ప్రజాప్రతినిధులకుగానీ, ప్రజలకుగానీ, ఓటు కోసం మద్యం, మాంసం పంచలేదని, ఒక్క రూపాయి కూడా ఎవరికీ ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్గాం జడ్పీటీసీ ఆముల నారాయణ, కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, ఎన్వీ రెడ్డి, బాదే అంజలి, కో-ఆప్షన్ మెంబర్ తస్నీమ్ భాను, పీటీ స్వామి, కౌశిక హరి, గోపు ఐలయ్య యాదవ్, పర్లపల్లి రవి, మెతుకు దేవరాజ్, జేవీరాజు, కాల్వ శ్రీనివాస్, నూతి తిరుపతి, నారాయణ, దాసరి ఎల్లయ్య, దాసరి శ్రీనివాస్, మేకల సమ్మయ్య, గాదం నందు, బందరాజు, నాగమణి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గోదావరిఖని శారదా నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఖాజా జహీర్ అహ్మద్ అధ్యక్షత వహించగా వైద్యులు డాక్టర్ లక్ష్మీవాణి, డాక్టర్ వనజ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ ఎలా సంక్రమిస్తుంది.. దీనిని సంక్రమించకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలి. దాని నివారణ మార్గాలు మొదలగు అన్ని అంశాల మీద విద్యార్థులకు ఎంతో అవగాహన కల్పించారు. ఎయిడ్స్ రోగుల పట్ల మనము ఎంతో ప్రేమ, అభిమానముతో ఉంటూ వారిలో మనోధైర్యాన్ని నింపాలని తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రంగోలి పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఖాజా జహీర్ అహ్మద్, వైద్యులు లక్ష్మీవాణి, వనజ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో సుబ్బారావు, శారదా, డా.కిరణ్మయి, ఉషారాణిలు పాల్గొన్నారు.అనంతరం కళాశాల నుంచి మున్సిపల్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు.

పురుగుల మందు సేవించి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ముత్తారం:



ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన బొమ్మెల్ల రాజమల్లు (55) శుక్రవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ముత్తారం ఎస్ మధుసూదన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అతని సోదరుడు బొమ్మెల్ల ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బొమ్మెల్ల రాజమల్లు భార్య లక్ష్మీ మృతి చెందిన తరువాత నుంచి రాజమల్లు మద్యానికి బానిసయ్యాడని, వ్యవసాయ కూలీగా కొనసాగుతున్న రాజమల్లు చేసిన కూలి పనుతో వచ్చిన డబ్బుతో నిత్యం మద్యం సేవించేవాడని తెలిపారు. శుక్రవారం కూడా మద్యం మత్తులో పురుగుల మందు సేవించాడని, ఆ విషయాన్ని తమకు తెలియ జేయగా, స్థానికంగా ఉన్న ముత్తారం పీహెచ్‌సీకి తరలించగా, పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో పెద్దపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడని తెలిపారు. ఈ మేరకు మృతుని సోదరుడు ప్రభాకర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ పేర్కొన్నారు.

11వ గని పాత రోడ్డు డిసెంబర్ 11న ప్రారంభం

ఎస్‌సీఈయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



జీఎంతో చర్చిస్తున్న వివిధ యూనియన్ల నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:
పోరాటంతోనే హక్కుల సాధించబడుతాయని జీడీకే 11వ గని కార్మికులు నిరూపించారని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీడీకే 11వ గని కార్మికులు తరచూ ప్రమాదాలకు నిలయంగా మారిన కొత్త రోడ్డు స్థానంలో పాత రోడ్డు పునర్ ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళన రెండు రోజులుగా చేయటం జరిగిందని, ఓసీపీ-5 ప్రారంభంతో పాత రోడ్డు స్థానంలో కొత్త రోడ్డు దాదాపు 15 కిలోమీటర్లు వేయడం జరిగిందని, ఈ కొత్త రోడ్డు కార్మికులకు ఏ రకంగాను అనుకూలంగా లేదని అన్నారు. గత ప్రారంభం నుంచి సీఐటీయూ కార్మికులు ఆందోళన చేసినప్పటికీ పాత రోడ్డు పునర్ ప్రారంభించకపోవడంతో కొత్త రోడ్‌తో దాదాపు చాలామంది కార్మికులు ప్రమాదాలకు గురై చనిపోయిన సందర్భాలు ఉన్నాయని, పెద్ద ఎత్తున సీఐటీయూ జీడీకే 1,3వ ఇంక్లయిన్ జంక్షన్ వద్ద రాస్తారోకో చేయడం జరిగిందని, అయినప్పటికీ మేనేజ్మెంట్ పెడచెవిన పెట్టి అదే మార్గంలో కార్మికులు, ప్రయాణికులు మంథని, భూపాలపల్లికి, వెళ్లే బస్సులు, లారీ బొగ్గు ట్రాన్స్‌పోర్ట్ నిత్యం రద్దీగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కొత్త రోడ్డు మొత్తం కూడా మూలమలుపులు, స్పీడ్ బ్రేకర్లు ఉండడం, బొగ్గు లారీ ట్రాన్స్‌పోర్ట్ పెద్దపెద్ద లోడ్లు ఎలాంటి పైకప్పు కవరేజ్, లేకుండా లారీలు రావడం వల్ల బొగ్గు పెల్లలు కార్మికుల మీద పడి ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ క్రమంలో కే.సంపత్ అనే కార్మికుడు ప్రమాదంలో మరణించడానికి కారణం కూడా బొగ్గు పెల్ల లారీపై నుంచి పడి వెంటనే లారీ కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందడం జరిగిందని తెలిపారు. దీంతో పెద్ద ఎత్తున కార్మికులు ఆగ్రహానికి గురై నవంబర్ 29 నుంచి రెండు రోజులపాటు ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ కార్మిక సంఘాలన్నీ కూడా అక్కడికి చేరుకొని పాత రోడ్డును పరిశీలించారు. దీంతో సింగరేణి యాజమాన్యం ఆర్జీ-1 జీఎం అన్ని కార్మిక సంఘా లతో చర్చలు జరిపి డిసెంబర్ 11న పాత రోడ్డును ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించడం జరిగిందని, కార్మికులందరూ ఐక్యతతో పోరాటం ద్వారానే హక్కులు నిలబడ తాయని నిరూపించారని కార్మికులు, కార్మిక సంఘాల ఐక్యతతో విజయం సాధించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్జీ-1 కార్యదర్శి మెండె శ్రీనివాస్, సహాయ కార్యదర్శి జేల్లా గజేంద్ర, ఉపాధ్యక్షులు ఆరెపల్లి రాజమౌళి, ఆర్జీ-3 నాయకులు గుత్తికొండ గోపాల్‌లు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎం

యంత్రాల తరలింపు పూర్తి

కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్



నవతెలంగాణ-మంథని
స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎం యంత్రాల తరలింపు పూర్తయిందని కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు.శుక్రవారం రామగిరి మండలంలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం స్ట్రాంగ్ రూమ్‌లలో యంత్రాల తరలింపు ప్రక్రియను రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు రాజేష్ సింగ్ రాణా,. పెద్దపల్లి, మంథని అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు శ్రీధరలతో కలిసి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మంథని అసెంబ్లీ నియోజకవర్గంకు సంబంధించిన ఈవీఎం యంత్రాలను గురువారం రాత్రి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచామని, పెద్దపల్లి, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధం చిన ఈవీఎం యంత్రాలను శుక్రవారం ఉదయం స్ట్రాంగ్ రూములకు తరలించి భద్రపరిచామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు జే. అరుణశ్రీ సి.హెచ్. మధుమోహన్, వి.హనుమా నాయక్‌లు, పాల్గొన్నారు.

ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నవతెలంగాణ-ముత్తారం:
ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గమని ముత్తారం మండల వైద్యాధికారి డాక్టర్ అమరేందర్ రావు అన్నారు. డిసెంబర్ 1 ఎయిడ్స్ డే సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అమరేంద్ర రావు తన సిబ్బందితో కలిసి ఆసుపత్రి నుంచి అడవి శ్రీరాంపూర్ చౌరస్తా వరకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని అన్నారు. ఎయిడ్స్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఈవో నరసింహారెడ్డి, సూపర్వైజర్ వీరేశం, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఫార్మసిస్ట్ జగదీశ్వర్, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్, స్టాఫ్ నర్స్‌మంగ, కల్పన, సునీత, ఏఎన్ఎంలు ప్రవంతి, రమాదేవి, ఆశాలున్నారు.

జిల్లాలో 77.96 శాతం పోలింగ్ నమోదు

కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్

నవ తెలంగాణ -పెద్దపల్లి
నవంబర్ 30న గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 77.96 శాతం పోలింగ్ నమోదు అయినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 2 లక్షల 54 వేల 266 మంది ఓటర్లు ఉండగా, పోలింగ్ నందు 2 లక్షల 7 వేల 397 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, 81.57 శాతం పోలింగ్ నమోదైందని కలెక్టర్ తెలిపారు.రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న 2 లక్షల 21 వేల 19 మంది ఓటర్లు ఉండగా, పోలింగ్ నందు లక్షా 51 వేల 865 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, 68.71 శాతం పోలింగ్ నమోదైందని కలెక్టర్ తెలిపారు.మంథని అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న 2 లక్షల 36 వేల 442 మంది ఓటర్లు ఉండగా, పోలింగ్ నందు ఒక లక్షా 95 వేల 635 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, 82.74 శాతం పోలింగ్ నమోదైందని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో ఉన్న 3 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 7 లక్షల 11 వేల 727 మంది ఓటర్లు ఉండగా, గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ లో 5 లక్షల 54 వేల 897 మంది తమ ఓటు హక్కు వినియోగి ంచుకున్నారని, 77.96 శాతం పోలింగ్ నమోదైందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రామగుండం ప్రజల

రుణాన్ని ఎప్పటికీ తీర్చుకోలేను

నవతెలంగాణ-గోదావరిఖని:
ఎన్నో జాతీయ పార్టీలు పోటీ చేసినప్పటికీ... వందల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినప్పటికీ... తెలంగాణ లేబర్ పార్టీ అభ్యర్థిగా టెలివిజన్ గుర్తుపై పోటీ చేసిన తనను అత్యధిక మెజారిటీతో గెలిపించబోతున్న రామగుండం ప్రజల రుణాన్ని తాను ఎప్పటికీ తీర్చు కోలేనని టీఎల్పీ రామగుండం అభ్యర్థి గొర్రె రమేష్ అన్నారు. తాను గెలిచాక రామగుండం నియోజక వర్గంను మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా మారుస్తానని, ఈ నియోజకవర్గంలో ఉన్నటువంటి ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కో తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన సీఎస్ఆర్, డీఎంఎఫ్టీ నిధులను రాబట్టి నియోజకవర్గ అభివృద్ధికి వెచ్చిస్తానని అన్నారు.

ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

సీనియర్ సివిల్ జడ్జి ఎం.అర్జున్

నవ తెలంగాణ- పెద్దపల్లి
హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహనతో ప్రజలలో చైతన్యం కలిగించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. అర్జున్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రి నుంచి ప్రధాన కూడలి గుండా మండల పరిషత్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీని సీనియర్ సివిల్ జడ్జి ఎం. అర్జున్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎం.అర్జున్ మాట్లాడుతూ, జాతీయ సగటు కంటే తెలంగాణలో హెచ్ఐవీ కేసులు నమోదు అధికంగా ఉందని, అందుకు ఈ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని, ప్రజలలో చైతన్యం కలగాలని, యువత టాటూ వేయించుకునే సమయంలో హెచ్ఐవీ సోకకుండా జాగ్రత్త వహించాలని కోరారు. జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, వివిధ కార్యక్రమాల ద్వారా ఎయిడ్స్ నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. అనుమానితులు స్వచ్ఛందంగా ఆసుపత్రులలో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు చేయించుకొని చికిత్స చేసుకోవడం ద్వారా తగు జాగ్రత్తలతో సాధారణ జీవితం గడపవచ్చునని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రమాకాంత్‌లుపాల్గొన్నారు.

గులాబీ డ్రెస్ వేసుకోండి

• పోలీసులకు ఆర్ఎస్పీ సూచన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు (టి) నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరపడంలో పోలీసులు వైఫల్యం చెందారని, బీఆర్ఎస్ కార్యకర్తల్లా వ్యవహరించిన పోలీసులు ఖాకీ డ్రెస్ వదిలి గులాబి డ్రెస్ వేసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు, సిర్పూరు అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తీవ్రంగా మండిపడ్డారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని 55, 56, 75, 90 నెంబర్‌ల పోలింగ్ కేంద్రాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు రిగ్గింగ్‌కు పాల్పడితే వారిని అరెస్ట్ చేయాల్సిన పోలీసులు, బీఎస్పీ కార్యకర్తలపై లాఠీఛార్జి చేయడం దారుణమన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ కార్యకర్తలపై రాళ్లతో దాడి చేస్తున్నా పోలీసులు చోధ్యం చూశారని మండిపడ్డారు. పోలింగ్ కేంద్రాల్లో బీఎస్పీ ఏజెంట్లను బీఆర్ఎస్ నాయకులు మరణాయుధాలతో బెదిరించడం వెనుక ఎమ్మెల్యే కోనప్ప హస్తం ఉందని ఆరోపించారు. బీఎస్పీ చీఫ్ ఎన్నికల ఏజెంట్ అర్షద్ హుస్సేన్‌ను బెజ్జూరులో తిరగకుండా స్థానిక డీఎస్పీ అడ్డుకున్నారని ఆరోపించారు. సిర్పూరులో బీఎస్పీ గెలువడం ఖాయమని, రాబోయే ఎన్నికలలో బీఆర్ఎస్ భారీ మూల్యం చెల్లించక తప్పదని అన్నారు.

బాధితులకు పరామర్శ...

బీఆర్ఎస్, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలకు మధ్య జరిగిన ఘర్షణలో రాళ్ల దాడిలో గాయపడ్డ బీఎస్పీ నాయకులను శుక్రవారం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు. బాదితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్‌హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి సిడం గణపతి, జిల్లా అధ్యక్షులు లెండుగురె శ్యాంరావు, కౌన్సిలర్‌లు లావణ్య శరత్ ముదిరాజ్, మీనాజ్ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధం..

ఓటేస్తూ తీసిన వీడియో వైరల్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో గురువారం పూర్తయింది. అయితే కొందరు ఓటేస్తు తీసిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. జిల్లాలో పలువురు ఓటర్లు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ఓటేసేటప్పుడు తమ మొబైల్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేసి వాట్సప్ స్టేటస్ పెట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఓటు వేసే ఏ ఓటరు కూడా వీడియో తీయొద్దని పోలింగ్ బూత్‌లోకి సెల్ ఫోన్‌లను తీసుకెళ్లద్దని నిబంధనలు ఉన్నాయి. కానీ నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ బూత్‌లోకి సెల్ ఫోన్ అనుమతి లేకున్నా కొన్ని పోలింగ్ బూతుల్లో అధికారుల నిర్లక్ష్యంతో రహస్యంగా సాగాల్సిన ఓటింగ్ ఇలా బహిర్గతం కావడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కొన్ని పోలింగ్ బూత్‌ల్లో సెల్ ఫోన్ తీసుకెళ్లకుండా సిబ్బంది తనిఖీ చేసి పంపించగా మరికొన్ని పోలింగ్ బూత్‌ల్లో ఎలాంటి తనిఖీలు చేపట్టలేదు. దీంతో ఓటర్లు ఫోన్ తీసుకెళ్లి ఓటేస్తు విడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు.



రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థినీ చౌదరి మహేశ్వరి పాఠశాల క్రీడా సమాఖ్య అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో నిర్వహించిన జోనల్ స్థాయి అథ్లెటిక్స్ షార్ట్ పుట్ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో మహేశ్వరి ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిందని, 5 నుంచి 7వ తేదీ వరకు వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. విద్యార్థినీకు వ్యాయామ ఉపాధ్యాయుడు బి.తిరుపతి, ఉపాధ్యాయులు, యాజమాన్య కమిటీ చైర్మన్ ప్రేమ్, కమిటీ సభ్యులు అభినందించారు.



నూతన మద్యం దుకాణాలు షురూ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతన మద్యం పాలసీ ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమైంది. ఆగస్టులో వైన్స్ దుకాణాలకు టెండర్ ప్రక్రియను చేపట్టారు. నవంబర్ 30తో పాత దుకాణాల కాలపరిమితి ముగియంతో ఆగస్టు మాసంలోనే దుకాణాల టెండర్ పిలిచారు. జిల్లాలోని మూడు స్టేషన్లు ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్ పరిధిలోని 41 దుకాణాలను దక్కించుకున్నారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి నూతన దుకాణాలను ప్రారంభించాలి. శుక్రవారం షాపులను దక్కించుకున్న దుకాణాలను మరమ్మత్తులు చేయడం, పూజ కోసం సామాగ్రిని సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే ఆయా దుకాణాలకు స్టాక్ కూడా సరఫరా చేశారు. శుక్రవారం సాయంత్రం వరకు కొన్ని దుకాణాలు, శనివారం నుంచి పూర్తి స్థాయిలో దుకాణాలను ప్రారంభించనున్నారు.

కుటుంబీకులతో అభ్యర్థులు సరదాగా గడిపి.. సందడి చేసి..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి నామినేషన్, ప్రచారంలో ఆయా పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు మునిగిపోయారు. దాదాపు నెల రోజుల పాటు ఎన్నికల పనుల్లో ఉండి కుటుంబానికి అభ్యర్థులు సమయం ఇవ్వాలేకపోయారు. గురువారం పోలింగ్ ప్రక్రియ ముగియడంతో శుక్రవారం ప్రధాన పార్టీల అభ్యర్థులు జోగు రామన్న, పాయల శంకర్, కంది శ్రీనివాస రెడ్డి కుటుంబ సభ్యులతో గడిపాడారు. స్వతంత్ర అభ్యర్థి సంజీవ్‌రెడ్డి మాజీ మంత్రి దివంగత నేత సీఆర్ఆర్ నివాసంలో నాయకులు, అనుచరులతో కలిసి పోలింగ్‌పై సమీక్షించారు. శాంతినగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో జోగు రామన్న తన కుటుంబీకులతో సరదాగా గడిపారు. అటు పాయల శంకర్ సైతం తన కుమారుడు పాయల శరత్, అల్లుడు సిద్దు, సతీమణి, మనమరాలితో సరాదగా గడిపారు. అలాగే కంది శ్రీనివాసరెడ్డి ఆయన సతీమణి పిల్లలతో సరదాగా గడుపుతూ ముచ్చటించారు. ప్రజలతో మమేకం అయి కుటుంబాన్ని నెల రోజుల పాటు సరైన సమయం ఇవ్వలేదు. కౌంటింగ్ రెండు రోజుల సమయం ఉండటంతో ఇండ్లలోనే అభ్యర్థులు గడిపారు.

అభ్యర్థుల భవితవ్యానికి పటిష్ట భద్రత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ముగిసిన నేపథ్యంలో జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు అధికారులు తరలించారు. అక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూం వద్ద ఒక డీసీపీ, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలతో పాటు ఇతర సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ బోర్కడ హేమంత్, ఎస్పీ సురేష్ కుమార్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించడంతో పాటు ఆదివారం జరిగే కౌంటింగ్ సంబంధించిన ఏర్పాట్లపై సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేస్తున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ



నవతెలంగాణ-బెజ్జూరు

మండల కేంద్రంలో డాక్టర్ అవినాష్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి బస్టాండు వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ అవినాష్ మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని తెలిపారు. వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎయిడ్స్ నిర్మూళనకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ కమల, ఎస్ఎన్ సుజాత, ఏఎన్ఎం రాంబాయి, స్వరూప, ఆరోగ్యమిత్ర కల్పన, ఎల్‌టీ దిలీప్ కుమార్, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ

లెక్కల్లో అభ్యర్థులు... కార్యకర్తలతో సమీక్షలు

- బీజీబీజీగా ఎమ్మెల్యే అభ్యర్థులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఇన్ని రోజులు ఎన్నికల ప్రచారంలో మునిగి తేలిన అభ్యర్థులు ఇప్పుడు లెక్కలతో కుస్తీ పడుతున్నారు. గురువారం ఎన్నికలు ముగియడంతో ఏ మండలంలో ఎన్ని ఓట్లు వస్తాయి, మెజార్టీ ఎంత వస్తుంది, గెలుపోటములు ఎలా ఉంటాయనే విషయంలో అభ్యర్థులు నాయకులు, కార్యకర్తలతో సమీక్షలు జరుపుతున్నారు. కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు ఇపుడు లెక్కల్లో మునిగి తెలుతున్నారు. సిర్పూరు (టి) నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు బరిలో ఉన్న విషయం తెల్సిందే. ఇందులో ప్రధాన పోటీ నలుగురు అభ్యర్థుల మధ్యే ఉంది. గురువారం ఎన్నికలు ముగిసిన తర్వాత నుండి అభ్యర్థులు తమ పార్టీల నాయకులు, కార్యకర్తలను ఇంటికి పిలిపించుకొని బేరీజు వేసుకుంటున్నారు. బీఆర్ఎస్ నుండి కోనేరు కోనప్ప, బీఎస్పీ నుండి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీజేపీ నుండి పాల్వాయి హరీష్‌బాబు, కాంగ్రెస్ నుండి రావి శ్రీనివాస్‌లు పోటీ చేశారు. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ముగిసిన తర్వాత నుండి అభ్యర్థులు ఆయా మండలాలు, బూత్‌ల వారీగా లెక్కలు వెసుకుంటున్నారు. గురువారం రాత్రే కోనేరు కోనప్ప తన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పోలింగ్ తీరుపై చర్చించారు. శుక్రవారం ఉదయం తన కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పాల్వాయి హరీష్‌బాబు, రావి శ్రీనివాస్‌లు శుక్రవారం తమ తమ పార్టీ కార్యాలయాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మండలాల వారీగా తమకు పోలైన ఓట్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నలుగురు అభ్యర్థులు విజయావకాశాలపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 17 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా ప్రధానంగా ముగ్గురు అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది. బీఆర్ఎస్ నుండి కోవ లక్ష్మి, బీజేపీ నుండి అజ్మీరా అత్మారాం నాయక్, కాంగ్రెస్ నుండి శ్యాంనాయక్‌లు పోటీ పడుతున్నారు. ఈ ముగ్గురు అభ్యర్థులు ఇన్ని రోజులు ప్రచారాలతో బీజీగా గడిపారు. పోలింగ్ ముగియడంతో ఇపుడు కార్యకర్తలతో సమీక్షలు జరుపుతున్నారు. ఏ సామాజికవర్గం నుండి ఏయే అభ్యర్థులకు ఎన్ని ఓట్లు పడతాయనే విషయంలో మండలాల వారీగా సమీక్ష చేస్తున్నారు. ఎవరికి వారే తామే గెలుస్తామనే ధీమాలో ఉన్నారు.



కుటుంబసభ్యులతో ఉల్లాసంగా గడుపుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి కోనప్ప



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



కార్యకర్తలతో సమావేశమైన రావి శ్రీనివాస్



పోలింగ్ సరళిపై కార్యకర్తలతో సమీక్ష జరుపుతున్న పాల్వాయి హరీష్‌బాబు

చెరువులో పడి బాలుడు మృతి



నవతెలంగాణ-మందమర్రి

చెరువులో పడి 13సంవత్సరాల బాలుడు మృతి చెందిన విషాద ఘటన మందమర్రిలో చోటు చేసుకుంది. స్థానికులు తొటి బాలురు తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి మండలం అందుగుల పేట గ్రామంలోని ఎర్ర చెరువులో చేపలు పట్టుకోవడానికి అదే గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు గురువారం మధ్యాహ్నం వెళ్లారు. చేపలు పట్టుకొనే క్రమంలో ప్రణీత్, మహేష్, అక్షయ్‌లు థర్మాకోల్ షీట్ సహాయంతో చెరువులోకి దిగారు. అదుపుతప్పి ముగ్గురు నీళ్లలో పడిపోయారు. ఒక్కరికి ఈత రావడంతో ఒడ్డుకు చేరుకున్నాడు. మరో బాలుడు తెప్ప సహాయంతో బయటకు వచ్చాడు. నవనందుల ప్రణీత్(13) నీళ్లలో మునిగిపోయాడు. ప్రణీత్‌ని ఒడ్డుకు తెచ్చిన తోటి మిత్రులు మరణించాడనే భయంతో అక్కడి నుండి వచ్చేసి ఎవరికి చెప్పకుండా ఉన్నారు. రాత్రి అయినా ప్రణీత్ ఇంటికి రాకపోవడంతో తల్లితండ్రులు మహేష్, అక్షయ్‌ను అడగగా జరిగిన విషయం తెలిపారు. రాత్రి 11 గంటల సమయంలో ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ప్రణీత్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా తమ కొడుకుని తోటి పిల్లలే హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుని తండ్రి నవనందుల సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మందమర్రి ఎస్సై చంద్రకుమార్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

అయోమయంలో పార్టీల నాయకులు

- ఈవీఎంలో దాగి ఉన్న అభ్యర్థుల భవితవ్యం

నవతెలంగాణ-జన్నారం

నెల రోజుల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులు వారి అనుచరులు ఆయా గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు హోరాహోరీగా ప్రచారాలు నిర్వహించారు. తమ నాయకుని గెలుపు కోసం రాత్రిపగలు కష్టపడ్డారు. తమ నాయకుడు గెలిస్తే నాయకుని ద్వారా లబ్ధి పొందవచ్చని దిగువ స్థాయి కార్యకర్తలు, నాయకులు కసిగా పనిచేశారు. నవంబర్ 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నాయకులు కార్యకర్తలు ఓటర్లను ప్రసన్నం చేసుకొని దగ్గర ఉండి తమ నాయకులకు ఓట్లు వేయించుకున్నారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను భద్రంగా స్ట్రాంగ్ రూంలకు తరలించారు. దీంతో తమ నాయకుల భవితవ్యం ఈవీఎంలో దాగి ఉందని అవి ఏ పార్టీకి ఏ నాయకుని గెలిపిస్తాయోనని నాయకులు చర్చించుకుంటున్నారు. నిన్నటి వరకు తమ నాయకుల కోసం ఓట్లు వేయించడానికి పోరాడిన దిగువ శ్రేణి నాయకులు ఈ రోజు తమ కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడిపారు. ఆదివారం ఏ నాయకుడు గెలుస్తాడో తెలియనుంది. గెలుపుపై ధీమాలో ఉన్న నాయకులు సంబరాలు చేసుకోవడానికి అన్ని సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

లక్షెట్టిపేట : ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని వెకంట్‌రావ్ పేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అన్నారు. శుక్రవారం వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండలం వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చందారం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో వైద్యాధికారి డాక్టర్ సతీష్ కుమార్ అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహిస్తున్నామని, అనుమానం ప్రతి ఒక్కరు



పరీక్షించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

చొప్పదండిలో విజయం వరించేదెవరినో..!

- రేపు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- ఓటింగ్ సరళిపై మల్లగుల్లాలు
- ప్రజలు, పార్టీ శ్రేణుల్లో నెలకొన్న ఉత్కంఠ



తన నివాసంలో ముఖ్యనేతలు, అనుచరులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



నవతెలంగాణ - గంగాధర

చొప్పదండి శాసనసభ నియోజకవర్గంలో విజయం వరించేదెవరినోనని ఉత్కంఠ అభ్యర్థులు, ప్రజలు, పార్టీ శ్రేణుల్లో నెలకొంది. ఇక్కడి నుండి 14 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్, కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం నువ్వా.. నేనా అనే తీరులో పోటీపడ్డారు. నవంబర్ 28న ప్రచారానికి తెరపడగా, 30న పోలింగ్ జరిగింది. నియోజకవర్గంలోని చొప్పదండి, రామడుగు, గంగాధర, బోయినిపల్లి, కొడిమ్యాల, మల్యాల మండలాల్లోని గ్రామ గ్రామాన జరిగిన పోలింగ్ సరళి తీరుపై ఆయా పార్టీల అభ్యర్థులు తమ తమ పార్టీ శ్రేణులు, ముఖ్యులతో మల్లగుల్లాలు పడుతూ గెలుపు అవకాశాలపై భేరిజు వేసుకునే పనిలో నిమగ్నం అయ్యారు. ఆరు మండలాల్లోని 186 గ్రామాల్లో ఓటర్లు ఎటు వైపు మొగ్గు చూపారనే అంశంపై చర్చను చేపట్టిన అభ్యర్థులు, ఆయా పార్టీల ముఖ్యనేతలు, పార్టీ శ్రేణులు ఏ గ్రామంలో ఏ మేరకు ఓట్లు తమ తమ పార్టీలకు, తమకు వేశారనే అంశంపై ఆరా తీశారు. ఏ చోట ఇద్దరు వ్యక్తులు కలిసినా ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయో.. ఎవరు గెలుస్తారోననే చర్చే కొనసాగుతుంటే, మండలాలు, గ్రామాల వారిగా తమకు ఎన్ని ఓట్లు వస్తాయి.. ఏ గ్రామంలో ఎంత మెజార్టీ వస్తుందంటూ బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్, కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యంతోపాటు ఆయా పార్టీల అభ్యర్థులు లెక్కలు వేస్తూ అనుచరులతో చర్చలు చేపట్టారు. గెలుపు మనదేనంటూ ఆయా పార్టీల అభ్యర్థులు దీమాను వ్యక్తం చేస్తూ విజయావకాశాలపై చర్చలు కొనసాగించారు. అభ్యర్థులు ఎవరి దీమాలో వారే ఉండగా, విజయం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

రేపు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

చొప్పదండి నియోజకవర్గంలో పోటీ పడిన అభ్యర్థుల భవితవ్యం రేపు చేపట్టే కౌంటింగ్ ద్వారా తేలనుంది. ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం, ఫలితాలు మధ్యాహ్నం 2 గంటల లోపే తెలిసే అవకాశాలు ఉన్నాయి. అభ్యర్థులు ఎవరికి వారే గెలుపు దీమాలో ఉండగా, ఆయా పార్టీల అభ్యర్థుల అనుచరులు మీరే గెలుస్తారంటూ మనో ధైర్యాన్ని కల్పించారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ తన నివాసంలో ఆరు మండలాల్లోని ముఖ్యులు, అనుచరులతో గెలుపు, మెజార్టీ అంశాలపై లెక్కలు వేస్తూ చర్చించారు. కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం మధురానగర్ చౌరస్తాలోని తన పార్టీ కార్యాలయంలో ఆయా మండలాలు, గ్రామాల ముఖ్యులతో గెలుపు, మెజార్టీ అంశంపై చర్చించారు.

కౌంటింగ్‌పై నిఘా పెట్టాలంటూ అభ్యర్థుల మొర

ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపుపై కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరు నిఘా పెట్టాలంటూ ఆయా పార్టీల అభ్యర్థులు మొరపెట్టుకున్నారు. మండలాలు, గ్రామాల్లోని ఈవీఎంలను ఓపెన్ చేసి లెక్కింపు చేసే ఓట్లను రాసుకుంటూ లెక్క తప్పకుండా చూడాల్సిన బాధ్యత మీదేనంటూ తమ తమ అనుచరులకు అభ్యర్థులు పలు సూచనలు చేశారు. విధిగా కౌంటింగ్ పాస్‌లు తెచ్చుకోవాలని, సమయానికి కౌంటింగ్ కేంద్రాలకు చేరాలంటూ కోరారు.

ఎస్జీఎఫ్ జాతీయ స్థాయి ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీలకు పారమిత విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న పారమిత విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ ఈ.ప్రసాదరావు

నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్‌లోని అలుగునూర్‌లో పారమిత వరల్డ్ స్కూల్ 12వ తరగతి విద్యార్థి నిజాం అస్మిత అండర్-19 బాలికల విభాగంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైంది. నవంబర్ 26న వరంగల్ జిల్లా తొర్రూరులో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీలలో నిజాం అస్మిత అత్యధిక ప్రతిభ కనబరచి కాంస్య పతకం సాధించి, జాతీయ స్థాయి పోటీలలో డిసెంబర్ 7 నుంచి 10 వరకు గుజరాత్ రాష్ట్రంలోని నందియాడ్‌లో జరుగు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననుందని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీకర్ తెలిపారు. ఈ సందర్భంగా నిజాం అస్మితను పారమిత విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ ఈ.ప్రసాదరావు, డైరెక్టర్స్ వీయూఎం ప్రసాద్, అనుకర్‌రావు, రష్మిత, ప్రసూన, వినోద్‌రావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీకర్, సమన్వయకర్త ఆర్.నాగరాజు, పీఈటీలు తిరుపతి, శ్రీధర్, శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ తీరుపై కార్యకర్తలతో సమాలోచనలు



నవతెలంగాణ - హుజురాబాద్

హుజురాబాద్ శాసనసభ నియోజకవర్గానికి గురువారం జరిగిన ఎన్నికల్లో పోలింగ్ తీరుపై తమ పార్టీకి ఎంత శాతం ఓట్లు వచ్చాయని అనే అంశంపై ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ అనుచరులతో సమాలోచనలు జరిపారు, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి హుజురాబాద్ పట్టణంలోని విద్యానగర్‌లోని తన ఇంట్లో నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన నాయకులు కార్యకర్తలతో పోలింగ్ సరళిపై చర్చించారు. ఎవరెవరు తమకు సహాయం చేశారు ఎవరైనా గ్రామాల్లో పనిచేయకుండా ఉన్నారా అన్న విషయాలను కార్యకర్తలు కౌశిక్‌రెడ్డికి తెలిపారు. తమ గ్రామంలో ఆధిక్యత వస్తుందని ఆయా గ్రామాల నాయకులు లెక్కలు కట్టి మరీ చెబుతున్నారు. మన పార్టీ విజయం సాధిస్తుందని నమ్మకంగా చెబుతున్నారు. ఎన్నికల్లో తనకోసం కష్టపడి పని చేసినందుకు కౌశిక్ రెడ్డి వారికి కతజ్ఞతలు తెలిపారు ఆదివారం రోజు ఫలితాలు అనంతరం మళ్లీ చర్చలు చేసుకుందామని కార్యకర్తలతో అన్నారు,

సింగపూర్ లో

హుజురాబాద్ మండలం సింగాపూర్ గ్రామంలోని తన నివాసంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్‌బాబు గురువారం జరిగిన ఎన్నికల ఓటింగ్ సరళిపై ముఖ్య కార్యకర్తలతో సమీక్ష జరిపా రూ, ఏయే గ్రామాల్లో తమకు ఆదిత్య ఉంటుంది ఏఏ గ్రామాల్లో ప్రత్యర్థులకు పట్టు ఉంది అక్కడ మనం ఎలాంటి ఫలితాలు సాధించామనే విషయాలను కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తుండడంతో ఎగ్జిట్ పోల్స్ సైతం కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ప్రకటిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు తమ విజయం తథ్యం అనే రీతిలో భావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

గణితశాస్త్రానికి చాలా ప్రాముఖ్యం

- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి
- మాథ్స్ ఒలంపియాడ్ టెస్ట్-2024 వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్

గణిత శాస్త్రం చాలా ప్రాముఖ్యమైందని, వివిధ పోటీ పరీక్షలకు ఉపకరిస్తుందని, తద్వారా విజయం సాధించడం చాలా సులువుగా ఉంటుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని స్థానిక వావిలాలపల్లిలో గల అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో డిసెంబర్ 22న శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకొని నిర్వహింపబడే అల్ఫోర్స్ మాథ్స్ ఒలంపియాడ్ టెస్ట్-2024 వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీనివాస రామనుజన్ భారతదేశం గర్వించదగ్గ గణిత శాస్త్రవేత్తని, భారతదేశ గణిత రంగానికి వారు చేసిన సేవలు చారిత్రాత్మమైనవని, ఆదర్శనీయమైనవని అన్నారు. చిన్నతనం నుంచే వారు గణితం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి గణిత శాస్త్ర అభివృద్ధికి ఎనలేని కృషిచేసారని తెలిపారు. వారి విశిష్టత, చేసిన సేవలను విద్యార్థులకు తెలియజేయడానికై ప్రతి సంవత్సరం వారి జ్ఞాపకార్థమై విద్యార్థులకు ప్రతిభ పరీక్షను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సంవత్సరం సైతం అదే స్ఫూర్తితో పరీక్షను నిర్వహించడానికి అన్ని సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే అతి పెద్ద మ్యాథ్స్ ఒలంపియాడ్ అని హర్షం వ్యక్తం చేశారు. ఈ పరీక్షను 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 17వ తేదీన ఉదయం 10 గంటలకు తెలంగాణలోని వివిధ అల్ఫోర్స్ పాఠశాలల్లో, కళాశాలల్లో పరీక్షను నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ పరీక్షలో మొదటి 3 స్థానాలలో గెలిచిన విద్యార్థులకు శ్రీనివాసన్ రామనుజన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే జాతీయ గణిత దినోత్సవ వేడుకలలో అతిథుల చేతుల మీదుగా బహుమతులు, నగదు పారితోషికాలను ప్రదానం చేస్తామని చెప్పారు. ఈ పరీక్షకు ఎలాంటి రుసుము లేదని, అల్ఫోర్స్ శాఖలు ఉన్న హైదారాబాద్, కరీంనగర్, జగిత్యాల, హనుమకొండ, వర్ధన్నపేట, వరంగల్, మంచిర్యాల, నిర్మల్, భైంసా, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్, కరీంనగర్‌లోని గోపాల్‌రావు పేటలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9160294441, 9398230614, 9246934441 నెంబర్లకు ఫోన్‌చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సిబ్బంది, పరీక్ష నిర్వాహకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనా సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

నవతెలంగాణ - కరీంనగర్

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం వెలిచాల గ్రామంలోని ప్రశాంతి బాల బాలికల కేర్ గృహాన్ని సందర్శించారు. బాల బాలికలకు భారత రాజ్యాంగం కల్పిస్తున్న హక్కుల గురించి వివరించారు. బాల్యం నుంచే మంచి నడవడికను అలవర్చుకోవాలని, చక్కగా చదువుకొని క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా వసతి గృహంలో అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ఎలాంటి న్యాయపరమైన సహాయాన్ని అందించడానికైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ కృష్ణార్జునచారి, తణుకు మహేష్, ఆశాడపు శ్రీనివాస్, వసతి గృహం నిర్వాహకులు సిరిల్, తదితరులు పాల్గొన్నారు.